సాక్షి హైదరాబాద్

శనివారం : 7 : జనవరి : 2023


నార్సింగి ఓఆర్ఆర్ వద్ద పొగమంచు


ట్యాంక్‌బండ్ వద్ద..

న్యూస్‌రీల్

నగరంలో ఇక కూల్‌రూఫ్ ఏరియా

రాయదుర్గం: హైదరాబాద్ నగరంలో 100 చదరపు కిలోమీటర్లు, తెలంగాణ రాష్ట్రంలో 300 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కూల్‌రూఫ్ ఏరియా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలంగాణ రాష్ట్ర ఎంఏ అండ్ యూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ వెల్లడించారు. పట్టణ ప్రాంతాలు గ్రామీణ పరిసరాల కంటే అధిక ఉష్ణోగ్రతలతో వేడిగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కూల్‌రూఫ్ పాలసీని ఇప్పటికే రూపొందించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గ్రీనరీని పెంచడం, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టడం లక్ష్యమన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్(ఎన్ఐయూఏ)ఇండియా, ఆగాఖాన్ ఏజెన్సీ ఫర్ హబిటాట్ (ఏకెఏహెచ్), గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో అర్బన్ హీట్ ఐలాండ్ (యూహెచ్ఐ) మిటిగేషన్ ద్వారా క్లైమేట్ యాక్షన్స్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ మేరకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా అర్వింద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉపశమన చర్యగా కూల్ రూఫ్‌లను ముందుకు తీసుకెళ్లేందుకు ఆసక్తిగా ఉందని చెప్పారు.

పకడ్బందీగా అర్చక ఆగమ పరీక్షలు



వెంకటేశ్వరకాలనీ: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో అర్చక ఆగమ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పటిష్టమైన భద్రత మధ్య ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 150 మంది అర్చకులకు గాను 128 మంది పరీక్షలకు హాజరయ్యారు. అర్చక పరీక్షలకు హాజరైన అభ్యర్థులంతా సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావడంతో పరీక్షా కేంద్రం కొత్తదనాన్ని సంతరించుకుంది. ఇదిలా ఉండగా శనివారం కూడా ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను సికింద్రాబాద్ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ బొల్లంపల్లి కృష్ణ, శ్రీనగర్ కాలనీ ఆలయ ఈవో ఎన్.లావణ్య పర్యవేక్షించారు. శనివారం ఈ పరీక్షలకు 188 మంది అర్చకులు హాజరుకానున్నారు. ఇందులో పేపర్–3తో పాటు మౌఖిక పరీక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. 40 సంవత్సరాలు పైబడ్డ అర్చకులకు కేవలం మౌఖిక పరీక్ష మాత్రమే ఉంటుందన్నారు.

హైటెక్‌సిటీ మెట్రోస్టేషన్‌లో యూఎస్ వీసా దరఖాస్తు కేంద్రం

- ఆదివారం నుంచి ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్‌సిటీ మెట్రో స్టేషన్‌లో అమెరికా వీసా దరఖాస్తు కేంద్రం ఆదివారం ప్రారంభం కానుంది. వీసా అప్లికేషన్ సెంటర్‌గా పిలిచే ఈ కేంద్రంలో అమెరికాకు వెళ్లాలనుకునేవారి వేలిముద్రల సేకరణ, వీసా దరఖాస్తు పత్రాల సమర్పణ, ఇంటర్వ్యూ తదితర సేవలను అందించనున్నట్లు మెట్రో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాన్ని అమెరికా కాన్సులేట్ అధికారులు ఏర్పాటుచేశారన్నారు. స్టేషన్ మధ్యభాగం (కాన్‌కోర్స్)లో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం ఈ కేంద్రం బేగంపేట్‌లోని కాన్సులేట్ సమీపంలోని గౌరా గ్రాండ్ భవన్‌లో ఉన్న విషయం విదితమే. నగరవాసులు, మెట్రో ప్రయాణికులు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని మెట్రో అధికారులు కోరారు.

హెచ్ఎండీఏ ప్రీబిడ్‌కు స్పందన

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ ల్యాండ్ పార్శిళ్లకు అనూహ్య స్పందన లభించింది. వరుసగా మూడవరోజు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 8 ల్యాండ్ పార్సెల్స్‌పైన శుక్రవారం బేగంపేట్ లోని టూరిజం హోటల్ ప్లాజాలో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశం విజయవంతం అయ్యింది.దాదాపు వంద మంది ఔత్సాహికులు, రియల్టర్లు ల్యాండ్ పార్శిళ్ల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తూ సమావేశానికి హాజరయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు సమీపంలో ల్యాండ్ పార్శిళ్లు ఉండడంతో వాటి కోసం ఎంతోమంది ఆసక్తి కనబరిచారు. ఘట్ కేసర్ సమీపంలోని కొర్రెముల, బాచుపల్లి, కూకట్‌పల్లి సమీపంలోని మూసాపేట్, గండి మైసమ్మ సమీపంలోని బౌరంపేట్, కుత్బుల్లాపూర్ సమీపంలోని సూరారం ప్రాంతాల్లో ఉన్న ఎనిమిది లాండ్ పార్సెల్స్ ను సొంతం చేసుకోవడానికి వీలుగా ఔత్సాహికులు వాటికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారుల సందేహాలకు అధికారులు సవివరంగా సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో హెచ్ఎండీఏ సెక్రెటరీ పి.చంద్రయ్య, ఎస్టేట్ ఆఫీసర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



బల్దియాలో బదిలీలు?

కమిషనర్‌తోపాటు ఇద్దరు ఐఏఎస్‌లకు స్థానచలనం ఉంటుందని చర్చోపచర్చలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ వర్గాల్లో ఐఏఎస్ అధికారుల బదిలీలపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. కమిషనర్ లోకేశ్‌కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా వచ్చి మూడేళ్లు దాటిపోవడంతో ఆయన బదిలీ తప్పదనే వాదన వినపడుతోంది. ఇటీవలే ఐపీఎస్ అధికారుల బదిలీలు జరగడం తెలిసిందే. ఐఏఎస్ అధికారుల బదిలీలు సైతం రేపో మాపో వెలువడవచ్చుననే ఊహాగానాలు ఊపందుకున్నాయి. వివిధ విభాగాల్లోని పలువురు ఐఏఎస్ అధికారులతోపాటు లోకేశ్‌కుమార్ బదిలీ కూడా జరగనుందని చెబుతున్నారు. సంబంధిత జీవో త్వరలోనే వెలువడనుందని ఎదురు చూస్తున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఓటర్ల తాజా జాబితా గురువారం వెలువడినందున.. ఇక ఏ రోజైనా బదిలీలు జరగవచ్చునని చెబుతున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఢిల్లీలో ఉన్నందున, ఆయన వచ్చాక బదిలీల జీవో వెలువడుతుందని భావిస్తున్న వారితోపాటు, ఆయన ఎక్కడ ఉన్నా బదిలీలకు ఆటంకం ఉండకపోవచ్చుననే అభిప్రాయాలు సైతం ఉన్నాయి. లోకేశ్‌కుమార్‌తోపాటు జీహెచ్ఎంసీలో మూడేళ్ల కాలం పూర్తి కావస్తున్న ఇద్దరు అడిషనల్ కమిషనర్లు బడావత్ సంతోష్, ప్రియాంక అల బదిలీలు కూడా ఉండవచ్చునని ప్రచారం జరుగుతోంది.

వీరితోపాటు 2020 ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీకి అడిషనల్/జోనల్ కమిషన్లుగా వచ్చిన రాహుల్‌రాజ్, ప్రావీణ్యలు చాలాకాలం క్రితమే బదిలీ కావడం తెలిసిందే. ఇద్దరు ఐఏఎస్‌ల బదిలీలతోపాటు దాదాపు మూడేళ్లుగా ఒకే చోట ఉన్న ఇతర ఉన్నతాధికారుల బదిలీలు కూడా జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎన్నికల సంవత్సరం అయినందున మూడేళ్లుగా ఉంటున్నవారి బదిలీలు తప్పవని భావిస్తున్నారు.

పొగమంచు..చిరుజల్లులు

- నగర వాతావరణంలో అనూహ్య మార్పులు
- కమ్మేసిన కారుమబ్బులు.. ఈశాన్యం నుంచి చలిగాలులు

సాక్షి, సిటీబ్యూరో: తెల్లవారు ఝామున దట్టమైన పొగమంచు..పలు చోట్ల చిరుజల్లులు నగరాన్ని కుమ్మేశాయి. శుక్రవారం సిటీ వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ సమస్యలున్న వారు ఉక్కిరిబిక్కిరయ్యారు. జలుబు, వైరల్ ఫీవర్స్,ఒళ్లు నొప్పులు, గొంతు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య భారీగా పెరిగింది. తూర్పు, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న చలిగాలులు గజగజలాడిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమవడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20.9 డిగ్రీల మేర నమోదైనప్పటికీ..కిందిస్థాయి గాలుల కారణంగా చలితీవ్రత పెరిగినట్లు బేగంపేట్‌లోని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 11 వరకు నగరంలో అతిశీతల పరిస్థితులు నెలకొంటాయని, కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుముఖం పట్టి చలితీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉంటుందని తెలిపింది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో విధిగా మాస్క్ ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహారం విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

శుక్రవారం ఉదయం నగరంలోని ఎల్బీనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట్, పంజగుట్ట, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చింతల్, బాలానగర్, సుచిత్ర, కుత్బుల్లాపూర్, బేగంపేట, తార్నాక, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి.

మరో రెండు నెలల్లో సైకిల్ ట్రాక్

శరవేగంగా పనులు

- మార్చి నాటికి వినియోగంలోకి...
- అంతర్జాతీయ ప్రమాణాలతో 23 కిలోమీటర్ల ట్రాక్
- సుమారు రూ.100 కోట్లతో నిర్మాణం


నార్సింగి వద్ద ఏర్పాటు చేస్తున్న సైకిల్ ట్రాక్


ట్రాక్ నమూనా చిత్రం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అధునాతన సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరో రెండు నెలల్లో ట్రాక్‌పై సైకిళ్లు పరుగులు తీయనున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని 23 కిలోమీటర్ల మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఈ నిర్మాణాన్ని చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును రెండు మార్గాల్లో చేపట్టారు. ఔటర్‌ను ఆనుకొని నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కిలోమీటర్లు, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కిలోమీటర్ల మార్గంలో 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్‌లలో ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలకు దీటైన అభివృద్ధి జరుగుతుందని హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తోన్న సైకిల్ ట్రాక్ నగర ప్రతిష్టను మరింత పెంచుతుందన్నారు.

ఆరోగ్యవిహారం...

సైక్లింగ్ ట్రాక్‌లో సైకిళ్లపైన పరుగులు తీయడం కేవలం ఒక వ్యాయామ ప్రక్రియగానే కాకుండా ఒక విహారంలాంటి అనుభూతిని కలిగించేవిధంగా అందంగా తీర్చిదిద్దుతున్నారు. ట్రాక్ పొడవునా అక్కడక్కడా రెస్ట్‌రూమ్‌లు, కెఫెటేరియాలు, బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లు ఉంటాయి. అలాగే సైకిళ్లను ఇక్కడే అద్దెకు తీసుకోవచ్చు. సైకిళ్లకు పంక్చర్‌లయినా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మరమ్మతులు చేసి ఇస్తారు. ట్రాక్ పొడవునా తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఉంటాయని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. అలాగే ట్రాక్‌ను పూర్తిగా పచ్చదనం ఉట్టిపడేవిధంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ మార్గంలో సైక్లింగ్ చేసేవారికి ఆకుపచ్చ నడవాలు పరుగులు తీస్తున్న అనుభూతి కలుగుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్న ఈ ట్రాక్‌పైన సైక్లింగ్ పోటీలను కూడా నిర్వహించనున్నారు. మరోవైపు భద్రత దృష్ట్యా ట్రాక్ పొడవునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.


సౌర విద్యుత్ వినియోగం...

ట్రాక్‌పై కప్పును పూర్తిగా సౌరఫలకలతో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్‌ను ట్రాక్ అవసరాలకు వినియోగించనున్నారు. లైట్లు, తదితర అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను ఇతరులకు వినియోగించే అవకాశం ఉంది. ఈ 23 కిలోమీటర్‌ల ట్రాక్ నిర్మాణం పూర్తయిన తరువాత రెండో దశలో గండిపేట వద్ద అతి పెద్ద సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు.



క్రమబద్ధీకరణ తర్వాతే అనుమతులు

జీవో 118 వర్తించే 44 కాలనీల ప్రజలకు నిబంధనలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీవో 118 వర్తించే 44 కాలనీల ప్రజలు కొత్తగా ఇళ్లు కట్టుకోవాలనుకున్నా, పునర్నిర్మించుకోవాలనుకున్నా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయి వారికి హక్కు లభించాకే సాధ్యం కానుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 44 కాలనీల్లోని స్లమ్స్‌లో నివసిస్తున్నవారు, బలహీనవర్గాలు, నిమ్న, మధ్య తరగతి ఆదాయాల వారు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో 118 జారీ చేయడం తెలిసిందే. సదరు దరఖాస్తుల స్వీకరణ,ఆమోదం బాధ్యతలు, కన్వేయన్స్ డీడ్ నిర్వహణను ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. సంబంధిత కలెక్టర్లు దరఖాస్తుల స్క్రీనింగ్, క్రమబద్ధీకరణ పూర్తిచేశాకే ప్రజలు టీఎస్‌బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవచ్చునని జీహెచ్ఎంసీ పేర్కొంది.టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకొని, భవననిర్మాణం పూర్తయ్యాక అసెస్‌మెంట్ చేసి ఆస్తిపన్ను గుర్తింపు నెంబరు(పీటీఐఎన్) జారీ చేయనున్నట్లు పేర్కొంది. సదరు కాలనీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పార్టీల మధ్య లిటిగేషన్లుండటం, ప్రైవేట్ డెవలపర్ల లేఔట్లలో ఇళ్లు నిర్మించుకోవడం, తదితర కారణాలతో ప్రాథమిక సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటివి జరగలేదు. రెవెన్యూ విభాగం క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్క్రీనింగ్, ఆమోదం పూర్తిచేశాక టీఎస్–బీపాస్ ద్వారా నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని జీహెచ్ఎంసీ తెలిపింది./ టీవల జరిగిన జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం సందర్భంగా సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించింది.

సెల్ఫ్ అసెస్‌మెంట్స్‌తో ఇంటినెంబర్లు రావు..

ఇటీవలి కాలం వరకు ప్రజలు సెల్ఫ్ అసెస్‌మెంట్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు.. ఆస్తిపన్ను ఎంత చెల్లించాలో తెలపడంతో పాటు చెల్లించగానే ఇంటినెంబరు సైతం ఆన్‌లైన్‌లోనే జారీ చేసిన జీహెచ్ఎంసీ.. 'అప్పుడో లెక్క.. ఇప్పుడో లెక్క– అక్రమాలే పక్కా' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనంతో ఆ విధానానికి స్వస్తి చెప్పింది. సంబంధిత డిప్యూటీ కమిషనర్లు పరిశీలించాకే ఇంటినెంబరు కేటాయించే విధానాన్ని ప్రస్తుతం అమల్లోకి తెచ్చింది.

హోటల్‌లో అగ్నిప్రమాదం.. కార్మికుడి మృతి

చాదర్‌ఘాట్/మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ నల్గొండ చౌరస్తాలోని సొహైల్ హోటల్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈఘటనలో హోటల్‌లో పనిచేస్తున్న కార్మికుడు మృతిచెందాడు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హోటల్ వంటగదిలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి దట్టమైన పొగ అలుముకోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న షాబుద్దీన్ అనే కార్మికుడు ఊపిరాడక మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హోటల్ నుంచి వస్తున్న దట్టమైన పొగ
మృతిచెందిన షాబుద్దీన్

నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే..

స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని రాజకీయ ఒత్తిళ్లతో లీజుకు తీసుకొని హోటల్ ఏర్పాటు చేయడమే కాకుండా...నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఓ నిండు ప్రాణం బలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హోటల్‌లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గతంలో హోటల్ లీజు అగ్రిమెంట్‌ను రద్దు చేసి ఒక భవనం నిర్మించి ఆసుపత్రి రోగులకు బెడ్ల సంఖ్యను పెంచాలని ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు అనుకున్నారు. తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు హోటల్ భవనాన్ని ఖాళీ చేయించలేక పోయారు. దీంతో చేసేదేమీ లేక హోటల్ లీజును పొడిగించారు. ఇక హోటల్‌కు దగ్గరలోనే అగ్నిమాపక కేంద్రం ఉండటం వల్ల పెద్ద ముప్పు తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.



ఆ అపహరణలో ఆసక్తికర కోణం!

- 2015లో కూకట్‌పల్లి పరిధిలో బాలుడి కిడ్నాప్
- ఐదుగురు నిందితుల్లో ప్రవీణ్ కుమార్ ఒకడు
- అప్పట్లో కేవలం డబ్బు కోసమే అని వాంగ్మూలం
- తాజాగా హష్ ఆయిల్ డిస్ట్రిబ్యూటర్‌గా అరెస్టు
- 'దుబాయ్ బెదిరింపు' కోణం బయటపెట్టిన వైనం


నిందితుడు ప్రవీణ్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి విశాఖ ఏజెన్సీకి పెట్రోలియం ఈథర్... అక్కడ నుంచి ఇక్కడకు హష్ ఆయిల్ అక్రమ రవాణా చేస్తూ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులకు చిక్కిన ఎస్. ప్రవీణ్ కుమార్‌పై గతంలో కిడ్నాప్ కేసు ఉంది. 2015లో కూకట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసు కోర్టులో వీగిపోయింది. ఇప్పటి వరకు అంతా ఆ కిడ్నాప్ కేవలం డబ్బు కోసమే జరిగిందని అంతా భావించారు... భావిస్తున్నారు. అయితే దాని వెనుక ఉన్న ఆసక్తికర కోణాన్ని ప్రవీణ్ ఇప్పుడు పోలీసుల ఎదుట బయటపెట్టాడు.

నిజామాబాద్ మహిళ... దుబాయ్‌లో సహజీవనం...

నిజామాబాద్ ప్రాంతానికి చెందిన మహిళ కొన్నేళ్ల క్రితం బతుకుతెరువు కోసం దుబాయ్ వెళ్లింది. అక్కడే ఉద్యోగం చేస్తున్న మంచిర్యాలకు చెందిన వ్యక్తితో ఈమెకు ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. దాదాపు రెండేళ్ల పాటు అతడితో సహజీవనం చేసిన ఆమె ఆపై నిజామాబాద్ తిరిగి వచ్చేసింది. అయితే ఇక్కడ బతకడం కష్టసాధ్యంగా మారడంతో పాటు అనివార్య కారణాల నేపథ్యంలో మళ్లీ విదేశాలకు వెళ్లడం సాధ్యం కాలేదు. దీంతో దుబాయ్‌లో ఉన్న మంచిర్యాల వాసి నుంచి వీలున్నంత డబ్బు గుంజాలని పథకం వేసింది. దీన్ని అమలులో పెట్టడంలో భాగంగా అతడిని పదేపదే ఫోన్లు చేసి 'నిజామాబాద్ వచ్చాక తాను గర్భం దాల్చిన విషయం తెలిసిందని, తనకు మగ బిడ్డ పుట్టాడని, వాడికి తండ్రివి నువ్వే' అంటూ చెప్పింది.

ఆరేళ్లకు అతడు వస్తాననడంతో...

తామిద్దరం బతకడానికి ప్రతి నెలా డబ్బు పంపాలని డిమాండ్ చేసింది. అప్పటికే వివాహితుడైన అతడు తన కుటుంబాన్ని మంచిర్యాలలోనే ఉంచాడు. తాను దుబాయ్‌లో మరో మహిళతో సహజీవనం చేసిన విషయం భార్యకు తెలియనీయలేదు. నిజామాబాద్ మహిళను నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు వస్తాయని భావించిన అతగాడు ఆమెకు డబ్బు పంపుతూ వచ్చాడు. ఇది జరిగిన ఆరేళ్లకు తాను నిజామాబాద్ వస్తున్నట్లు దుబాయ్ నుంచి సమాచారం ఇచ్చాడు. అలా అతడు వచ్చి తనను కలిస్తే తన బండారం బయటపడటంతో పాటు అసలు విషయం తెలుస్తుందని ఆమె భావించింది. అదే జరిగితే తనకు ప్రతి నెలా వచ్చే డబ్బు రాకపోవడంతో పాటు ఇప్పటి వరకు పంపిందీ తిరిగి ఇమ్మంటాడని భయపడింది. దీంతో అతడు వచ్చేలోపు ఓ ఆరేళ్ల బాలుడు తన వద్ద ఉండాలని భావించింది. అదే విషయాన్ని తన స్నేహితుడికి చెప్పడంతో అతడు, ప్రవీణ్ కుమార్‌తో సహా మొత్తం ఐదుగురు రంగంలోకి దిగారు. ఈ ఐదుగురిలో కూకట్‌పల్లికి చెందిన వాళ్లూ ఉన్నారు. దీంతో వీళ్లు ఆ ప్రాంతంలో కనిపించిన ఓ ఆరేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి నిజామాబాద్‌లో ఆమెకు అప్పగించారు.

ఫ్రీగా అప్పగించడం ఇష్టంలేక...

దుబాయ్ నుంచి వచ్చిన 'బాలుడి తండ్రి' నిజామాబాద్‌లో ఆ మహిళ వద్ద కొన్ని రోజుల పాటు ఉన్నాడు. ఆ చిన్నారి తమకు పుట్టిన బిడ్డగానే భావించాడు. అయితే ఓ రోజు.. ఆ బాలుడు తన కుమారుడు కాదని తెలుసుకొని ఆమెను నిలదీశాడు. ఆ తరువాత వారిని వదిలి మంచిర్యాల వెళ్లిపోయాడు. దీంతో ఆమె బాలుడిని తిరిగి తీసుకువెళ్లాల్సిందిగా ప్రవీణ్ సహా ఐదుగురికీ చెప్పింది. నిజామాబాద్ వెళ్లి బాలుడిని తీసుకువచ్చిన వీళ్లు తల్లిదండ్రులకు అప్పగించడానికి వెనుకాడారు. ఊరికే ఇవ్వడం ఎందుకని భావించి ఎంతో కొంత వసూలు చేసే ప్రయత్నం చేశారు. బాలుడి తండ్రికి ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. అప్పటికే బాలుడు తప్పిపోయినట్లు కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులకు ఈ విషయం తెలిసింది. డబ్బు డిమాండ్ విషయం తెలుసుకున్న పోలీసులు వలపన్ని ఐదుగురినీ అరెస్టు చేశారు. అప్పట్లో విచారణలో మాత్రం తాము కేవలం డబ్బు కోసమే ఈ పని చేశామని నిందితులు చెప్పడంతో అలానే రికార్డుల్లోకి ఎక్కింది.

ఆరితేరిన దొంగ అనిల్‌కుమార్

- నకిలీ పేరు, చోరీ వాహనాలతో వ్యవహారం
- మరో ఇద్దరితో కలిసి ముఠా కట్టి ఈ నేరాలు
- అరెస్టు చేసిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- 690 గ్రాముల బంగారం, బైక్‌లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లోని కొండగూడెం నుంచి వచ్చి నగరంతో పాటు తెలంగాణలో చోరీలు చేసిన ఆరితేరిన దొంగ అనిల్‌కుమార్ చిక్కాడు. చోరీ వాహనంపై తిరుగుతూ దొంగతనాలు చేసే ఇతగాడిని దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో ఈస్ట్‌జోన్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలు సునీల్ దత్, చక్రవర్తి గుమ్మి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం...కొండగూడెంకు చెందిన మానుకొండ అనిల్ కుమార్ ఖరీదైన ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుని చోరీలు చేస్తాడు. ఇతడిపై ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో కేసులు ఉన్నాయి. ప్రతి చోరీ తర్వాత ఆ సొత్తును సొమ్ము చేసుకుని రాష్ట్రం దాటేస్తాడు. పోలీసులకు దొరక్కుండా ఉండటానికి, జల్సాలు చేయడానికి గోవా, బెంగళూరుల్లో మకాం ఏర్పాటు చేసుకుంటాడు. దాదాపు 30 నేరాలు చేసిన ఇతడిని 2021లో పశ్చిమ గోదావరి జిల్లా తడికలపూడి పోలీసులు అరెస్టు చేశారు.గతేడాది మార్చిలో పీడీ యాక్ట్ ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు. అక్కడే ఇతడికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇచ్ఛాపురం గోపి, నగరంలోని బోడుప్పల్‌కు చెందిన పి.కార్తీక్‌తో పరిచయమైంది. మోసం కేసులో రాజు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో కార్తీక్ అదే జైలుకు వెళ్లారు. జైల్లోనే వీళ్లంతా స్నేహితులుగా మారారు. గోపి తనకు ఉన్న ఆర్థిక ఇబ్బందులు, అప్పుల విషయాన్ని అనిల్‌తో చెప్పాడు. దీంతో అతగాడు తనతో ఉండాలని, ఇద్దరం కలిసి చోరీలు చేసి డబ్బు సంపాదిద్దామని చెప్పాడు. దీనికి గోపి అంగీకరించడంతో తొలిసారిగా జట్టు కట్టాడు. గతేడాది నవంబర్‌లో జైలు నుంచి వచ్చిన వీళ్లిద్దరూ చోరీలకు పథకం వేశారు. పోలీసుల నిఘాకు చిక్కకుండా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణను టార్గెట్‌గా చేసుకున్నారు. బస్సులో సిటీకి వచ్చి మారుపేర్లతో దిల్‌సుఖ్‌నగర్‌లోని లాడ్జీల్లో బస చేశారు. మలక్‌పేటలో ఓ ద్విచక్ర వాహనం చోరీ చేసి దానిపై వరంగల్‌లోని సుబేదారీకి వెళ్లారు. అక్కడ ఓ ఇంట్లో బంగారం, వజ్రాభరణాలను దొంగతనం చేశారు. వాహనాన్ని వరంగల్‌లోనే వదిలేసి పరారయ్యారు. ఇదే పంథాలో ఏపీలోని నర్సీపట్నంలో వాహనం చోరీ చేసి విశాఖపట్నంలోని ఓ ఇంట్లో దొంగతనం చేశారు. ఈ చోరీ సొత్తును విక్రయించడం కోసం కార్తీక్ సహాయం తీసుకున్నారు. ఈ త్రయం వ్యవహారాలపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు వి.నరేందర్, ఎన్.శ్రీశైలం, షేక్ బుర్హాన్, కె.నర్సింహులు తమ బృందాలతో వలపన్ని ముగ్గురినీ అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు వాహనాలు 690 గ్రాముల బరువున్న బంగారు, వజ్రాభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వీరిని మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. ఈ నిందితుల అరెస్టుపై వరంగల్ పోలీసులకు సమాచారం ఇవ్వనున్నారు.

రీల్స్ కోసం ఫోన్ల స్నాచింగ్!

- ముఠాగా మారిన ఇద్దరు యువకులు
- రద్దీ లేని ప్రాంతాల్లో వరుస నేరాలు
- ఇరువురినీ కటకటాల్లోకి పంపిన టాస్క్‌ఫోర్స్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ చక్రవర్తి గుమ్మి

సాక్షి, సిటీబ్యూరో: రీల్స్ షూట్ చేసి ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేయడానికి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తున్న ముఠాను దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. చిక్కిన ముగ్గురిలో ఇద్దరు 'కొన్నేళ్లుగా' ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ చదువుతున్నారు. వీరి నుంచి వాహనంతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం ఆయన టాస్క్‌ఫోర్స్ డీసీపీ చక్రవర్తి గుమ్మితో కలిసి బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం..

- మాదన్నపేటకు చెందిన మహ్మద్ ఇషాక్, మహ్మద్ తహవుద్దీన్ బాల్య స్నేహితులు. ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ ఫెయిలైన వీరు చిన్న చిన్న పనులు చేసుకుంటూ ప్రతి సంవత్సరం ఆ పరీక్షలు రాయడానికి ఫీజు కడుతూనే ఉన్నారు.
- సోషల్ మీడియా అంటే మక్కువ ఉన్న వీరికి ఇన్‌స్టాగామ్‌లో ఖాతాలు ఉన్నాయి.
- ఆకర్షణీయమైన రీల్స్ షూట్ చేసి వాటిలో పెట్టడానికి మంచి వస్త్రాలు, వాహనంతో పాటు పిక్సల్స్ ఎక్కువగా ఉన్న సెల్‌ఫోన్ తదితరాలు కావాల్సి వచ్చింది.
- వీటిని సమకూర్చుకోవడానికి అవసరమైన డబ్బు కోసం నేరాలు చేయడం మొదలెట్టారు.
- ఇషాక్‌పై గతంలో నాలుగు సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులున్నాయి. తహవుద్దీన్‌తో కలిసి ఇతడు ఇటీవల ఎస్సార్‌నగర్‌లో ఓ పల్సర్ వాహనం చోరీ చేశాడు.
- ఇద్దరూ కలిసి దీనిపై తిరుగుతూ నగరంలోని రద్దీ తక్కువగా ప్రాంతాలు ఎంచుకుంటున్నారు.
- అక్కడ రెక్కీ చేసి ఒంటరిగా ఉండి సెల్‌ఫోన్ మాట్లాడుతున్న, చూస్తున్న వారిని ఎంచుకునేవారు. అదును చూసుకుని వాహనంపై వెళ్లి ఆ ఫోన్ స్నాచింగ్ చేసి పారిపోయేవారు.
- ఇలా గడిచిన కొన్నాళ్లలో హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని సుల్తాన్ బజార్, నారాయణగూడ, మీర్‌పేట్, ఎల్బీనగర్, చైతన్యపురి, వనస్థలిపురం, కాచిగూడల్లో 9 సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేశారు.
- వీటిని తమ స్నేహితుడైన కారు డెంటింగ్ వర్కర్ మహ్మద్ ఖైఫ్ ద్వారా అమ్మించారు.
- వీరి వ్యవహారాలపై సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు వి.నరేందర్, ఎన్.శ్రీశైలం, షేక్ బుర్హాన్, కె.నర్సింహులు వలపన్ని అరెస్టు చేశారు.

కానిస్టేబుల్‌ను పరామర్శించిన సైబరాబాద్ సీపీ


మెడికవర్ ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: దండగుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రాజు ఆరోగ్య పరిస్థితిని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలుసుకున్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో రాజును కమిషనర్ పరామర్శించారు. అనంతరం అతడి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఒక కేసు దర్యాప్తు విషయంలో జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోని ఘటనా స్థలానికి మూడు టీమ్‌లు వెళ్లగా రాజుపై దాడి జరిగిందన్నారు. దాడి చేసింది ఓ పాతనేరస్తుడని కమిషనర్ చెప్పారు. ఛాతీ భాగంలో బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైందని, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని కమిషనర్ చెప్పారు. కాగా, కానిస్టేబుల్ రాజు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, 24 గంటలు గడిస్తేనే పరిస్థితి తెలుస్తుందని మెడికోవర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో రూ. 77 లక్షల బంగారం పట్టివేత


దుస్తుల పొరల మధ్య పేస్టు రూపంలో ఉన్న బంగారం

శంషాబాద్: నలుగురు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం దుబాయ్ నుంచి రెండు వేర్వేరు విమానాల్లో వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేయగా, అక్రమంగా బంగారం తరలిస్తూ నలుగురు పట్టుబడ్డారు. వీరు దుస్తులకు ఉన్న గుండీలు (బటన్), దుస్తుల పొరల మధ్య పేస్ట్ రూపంలో మొత్తం 1409 గ్రాముల బంగారం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.77 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మెట్రో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



భాగ్యనగర్‌కాలనీ: మూసాపేట మెట్రో స్టేషన్‌లో మెట్రో రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు కథనం ప్రకారం...శుక్రవారం భరత్‌నగర్ నుంచి కూకట్‌పల్లి వైపు వస్తున్న మెట్రో రైలు కింద సుమారు 35–40 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పడ్డాడు. వెంటనే సిబ్బంది గమనించి బయటకు తీయగా అప్పటికే అతను చనిపోయాడు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. సీసీ పుటేజీని పరిశీలించగ మెట్రో రైలు వస్తుండగా ప్లాట్‌ఫారం నుంచి కావాలనే దూకినట్లుగా ఉందని పోలీసులు తెలిపారు. అతడి వద్ద రైలు టికెట్ కూడా లేకపోవటంతో ఎక్కడి నుంచి వచ్చాడనేది తెలియాల్సి ఉందని, ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

గోల్కొండ: బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... సాలెనగర్ కంచె, శివ మందిర్ సమీపంలో నివసించే షేక్ అక్రమ్(25) ప్రైవేట్ వాటర్ ఫిల్టర్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతను 2018లో ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు ఇతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన 12వ అదనపు మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి కవిత నిందితుడు షేక్ అక్రమ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.